
ప్రజాశక్తి
శనివారం 22 ఫిబ్రవరి 2025
5
విజయనగరం



ఏప్రిల్‌కి మానాపురం వంతెన ప్రారంభం కావాలి

ప్రజాశక్తి-విజయనగరం

మానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జిని ఏప్రిల్ నాటికి ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, కాంట్రాక్టర్లతో ఆర్‌ఒబి పనులపై కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటి వరకు 81 శాతం పనులు పూర్తయ్యాయని, మార్చి లోపల మిగిలిన 19 శాతం పూర్తి చేసి ఏప్రిల్ 1 నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. 2021 లో పనులు ప్రారంభం అయ్యాయని, 2023 జనవరి నాటికే పూర్తి చెయ్యవలసి ఉందని, ఇప్పటికే ఆలస్యం అయ్యిందని అన్నారు. ఇక పై వారం వారం సమీక్ష చేస్తానని, పనుల్లో పురోగతి కనపడాలని ఆదేశించారు. గుంతలు లేని రహదారుల నిర్మాణంలో భాగంగా మొదటి దశ కింద 76 పనులను రూ.10.5కోట్లతో పూర్తి చేశామని, రెండో విడత కింద మంజురైన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో నేషనల్ హైవే ఎస్ఇ విజయరత్నం, ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, డిఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సిపిఎస్ రద్దు కోసం చేపట్టిన పోరాటంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి (ఫైల్)

పదవి వచ్చాక ఏం చేస్తామో చెప్పడం వేరు... పదవి లేకపోయినా సమస్యలపై పోరాడి సాధించి చూపించడం వేరు... పదవుల అనుభవించినా ఏమీ చేయలేక అచేతనంగా ఉండిపోవడం వేరు... ఇందులో రెండో కోవకు చెందినవారే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి. మాజీ ఎమ్మెల్సీలు మూడో కోవలో ఉంటారని వేరేగా చెప్పనక్కర్లేదు. మిగిలినవారంతా మొదటి కోవలో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విజయగౌరి తరపున ఎన్నికల ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. అందుకు తగ్గట్టే ఓటర్ల నుంచి ఆదరణ లభిస్తోంది.

ఉపాధ్యాయ ఉద్యమాల్లో మేటి విజయగౌరి

- ఎమ్మెల్సీ ప్రచారంలోనూ అదే జోరు
- అడుగడుగునా ఆదరణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలో 10మంది అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం విధితమే. ఇందులో యుటిఎఫ్ సహా పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలోవున్న కోరెడ్ల విజయగౌరి, పిఆర్‌టియు అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు, ఎపిటిఎఫ్ అభ్యర్థి రఘువర్మ మధ్య ప్రధాన పోటీ కనిపిస్తోంది. వీరిలో శ్రీనివాసులు నాయుడు, రఘువర్మ ఇంతకు ముందు ఎమ్మెల్సీలుగా పనిచేసినవారే. ఉపాధ్యాయ సమస్యలపైగానీ, విద్యారంగ పరిరక్షణకు గానీ పెద్దగా కృషి చేసిన పరిస్థితు లేమీ లేదు. మరో మాటలో చెప్పాలంటే పాలకపార్టీలు చెప్పినట్టుగానే నడుచుకున్నారు. వీరిపై పోటీకి తలపడుతున్న విజయగౌరి చరిత్ర అందుకు భిన్నం. ఇంతకు ముందు ఎమ్మెల్సీగా పనిచేయక పోయినప్పటికీ యుటిఎఫ్ నేతగా దాదాపు 30ఏళ్లగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నారు. రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటివాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు చొరవ చూపారు. జిఒ నెంబర్ 72కు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసులు బనాయించినా వెరవలేదు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన కేసు ఏడేళ్లపాటు నడిచింది. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. అంతేకాదు జాతీయ విద్యా విధానం అమలు, 117 జీవోతో పాఠశాలల ఎత్తివేతకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించారు. ఐటిడిఎ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టిన ఉద్యమాలను ముందుండి నడిపించారు. కెజిబివి, మోడల్‌స్కూళ్ల ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన పోరాటాల్లోనూ విజయగౌరి అగ్రభాగాన నిలిచారు. అంతేకాదు కరోనా సమయంలోనూ యుటిఎఫ్ తరపున ఆమె ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సహాయ సహకారాలు అందించారు. ఈనేపథ్యంలో విజయగౌరి పోరాట చరిత్రను, ప్రస్తుత, గత ఎమ్మెల్సీల పనితీరును ఉపాధ్యాయులు బేరీజు వేసుకుంటున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలంటే.. ఉపాధ్యాయుల హక్కులను నిలబెట్టుకోవాలన్నా విజయగౌరిని గెలిపించు కోవాల్సిన ఆవశ్యకత ఉందని చర్చించుకుంటున్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం విజయగౌరిని గెలిపించండి

ఐటిఐ ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు తోడర్ మల్

బొబ్బిలి : ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఐటిఐ ఉద్యోగుల సంఘం మాజీ నాయకులు పి.తోడర్‌మల్ కోరారు. విజయగౌరికి మద్దతుగా శుక్రవారం ప్రభుత్వ ఐటిఐలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చట్టసభల్లో పోరాటం సాగిస్తున్నారని చెప్పారు. సమస్యలపై పని చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐటిఐ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట్ల శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.



చింతపల్లి మండలం వంగసార బాలికోన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

గిరిజన ఉపాధ్యాయుల గొంతుకనవుతా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

అరకులోయ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం అల్లూరి జిల్లాలోని చింతపల్లి, హుకుంపేట, అరకులోయ మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరగనుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని అన్నారు. 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని రద్దు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిజానికి ఆ జిఒ రద్దు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను తీసుకొచ్చి అమలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రాథమిక, మాధ్యమిక విద్యకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. ప్రభుత్వం 1/70 చట్టానికి సవరణ చేయాలన్న ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. ఏజెన్సీలో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో ఐద్వా రాష్ట్ర నాయకులు వి.వి.జయ, సిఆర్‌టిల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించండి

ఫ్యాప్టో మాజీ చైర్మన్ బాబురెడ్డి

జామి, విజయనగరంటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరిని గెలిపించాలని ఫ్యాప్టో మాజీ చైర్మన్ పి.బాబురెడ్డి కోరారు. విజయనగరంలోను, జామి మండలం కుమరాం, జామి, లొట్లపల్లి, అలమండ పాఠశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, మండల గౌరవాధ్యక్షులు కొత్తలి వెంకటరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వాసుదేవరావు, ఎం.తాతం నాయుడు పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

గుడ్లు, మాంసం రవాణాపై ఆంక్షల్లేవు : పశుసంవర్థక శాఖ జెడి వై.వి.రమణ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, గుడ్లు, మాంసం రవాణాపై ఆంక్షలు లేవని పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వైవి రమణ తెలిపారు. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన నేపథ్యంలో జిల్లాలోని కోళ్ల పెంపకం పరిశ్రమ కలిగిన రైతులు, పౌల్ట్రీ యజమానులు జిల్లాలోని కోళ్లకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా జీవభద్రత చర్యలు(బయో సెక్యూరిటీ) చేపట్టాలని కోరారు. బర్డ్ ఫ్లూ వ్యాధి నివారణపై కోళ్ల పరిశ్రమ యజమానులు, కోళ్లపెంపకం రైతులకు శుక్రవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, గుడ్లు, కోడి మాంసం ఉత్పత్తులను 100 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో వండుకొని ప్రజలందరూ నిర్భయంగా తినొచ్చని పేర్కొన్నారు. నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ(నెక్) తో కలసి పశు సంవర్థక శాఖ త్వరలో కోడిమాంసం, గుడ్ల వంటకాలతో జిల్లా కేంద్రంలో త్వరలోనే ఒక మేళాను నిర్వహించి ప్రజల్లో వున్న అపోహలు తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో బహుళార్థ పశువైద్య శాల ఉప సంచాలకులు డాక్టర్ జి.మహాలక్ష్మి, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎంబివి ప్రసాద్, ఎడి డాక్టర్ వేణుమాధవ్, కోళ్ల పరిశ్రమ రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజన రైతులు, నాయకులు

భూధార్‌ను నిలిపేయాలని ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

భూధార్ రిజిస్ట్రేషన్ నిలిపి వేసి, పాత పద్ధతిలోనే రైతులకు పథకాలు అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, కౌలు రైతుల సంఘం అధ్వర్యంలో శుక్రవారం మెంటాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ సొంతభూమి కలిగిన రైతులను నమోదు చేసి, ఓనర్ షిప్‌ను పట్టాదారు పాసుపుస్తకం, ఇతర అధీకృత రికార్డులు సరిచూసి, అన్ని సరిగ్గా ఉంటే యూనిక్ ఐడిని జారీ చేస్తున్నారన్నారు. డి-పట్టా, ఆర్ఒఎఫ్ఆర్, ఇనాం భూములు, కౌలుకు సాగుచేస్తున్న దళితులు, గిరిజనులకు, ఇతర పేదలకు భూధార్ నమోదు కాకపోవడంతో నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల భూధార్ నిలిపి వేయాలని డిమాండ్‌చేశారు. పాత పద్ధతిలోనే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, బ్యాంకు రుణాలు, రాయితీలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కె.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు టి.సోములు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ చేయలేదని రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నెల్లిమర్ల



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తున్న రైతును ఆపుతున్న కుటుంబ సభ్యులు

ఎన్ని సార్లు అడుగుతున్నా రెవెన్యూ అధికారులు తన భూమి ఆన్‌లైన్ చేయడం లేదనే ఆవేదనతో ఓ రైతు పురుగు మందు తాగి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆత్మ హత్యా యత్నం చేశాడు. మండలంలోని గుషిణి పంచాయతీ పరిధి చనమల్ల పేటకు చెందిన చనమల్ల అబద్దం అనే రైతు 20ఏళ్ల క్రితం గ్రామంలో ఎకరం న్నర భూమిని కొన్నాడు. ఈ భూమిని ఆన్ లైన్ చేయాలని కోరుతూ కొన్నేళ్లగా రెవిన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అయినా అధికారులు సహకరించకపోవడంతో మనస్థానికి గురై తహశీల్దార్ కార్యాలయం బయట పురుగుమందు తాగేందుకు ప్రయత్నించాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకొని వారించారు. ఇటీవల గ్రామానికి చెందిన విఆర్ఓ ఆన్‌లైన్ చేయడానికి డబ్బులు అడిగినట్లు రైతు రైతు అబద్దం ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది పెద్దలు ద్వారా ఆన్ లైన్ చేయడానికి ప్రయత్నం చేసినట్లు రైతు చెబుతున్నారు. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా రైతు వద్ద క్రయ రిజిస్ట్రేషన్ పత్రాలు లేనందున ఆన్‌లైన్ చేయలేమని, రిజిస్ట్రేషన్ చేయించుకొని వస్తే ఆన్ లైన్ చేస్తామని చెప్పినట్లు తెలిపారవు.

వినతుల పెండింగ్‌పై కలెక్టర్ ఆగ్రహం

- తహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్‌ఎస్‌పై సమీక్ష
- అర్జీదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా
- అధికారులపై చర్యకు సిసిఎల్‌ఎకు నివేదిక



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)కు అందిన వినతులను అధికారులు పెండింగ్‌లో ఉంచడంపై జిల్లా కలెక్టర్ అంబేద్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సకాలంలో ఎందుకు పరిష్కరించడం లేదనీ, రీ ఓపెన్‌కు ఎందుకు అవకాశం ఇస్తున్నారని మండిపడ్డారు. పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముందుగా వచ్చిన అర్జీని పూర్తిగా చదివి, అర్జీదారునితో మాట్లాడి వారి సమస్యను తెలుసుకోవాలని తాహసీల్దార్‌కు, ఇతర అధికారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొత్తవలస మండలంలో శుక్రవారం పర్యటించారు. తాహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని పిజిఆర్‌ఎస్‌పై సమీక్షించారు. సుమారు 57 వినతులను పెండింగ్ లో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వినతులు ఎక్కువగా రీ ఓపెన్ అవుతుండటంపై తాహసీల్దార్ నీలకంఠరావును నిలదీశారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి, మంత్రుల కార్యాలయాలకు జిల్లా నుంచి అందిన వినతులను పరిశీలించారు. కొంతమంది ఫిర్యాదుదారులను తాహసీల్దార్ కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. అదే గ్రామానికి చెందిన అర్జీదారుడు గొరపల్లి గణేష్ ను జిల్లా కలెక్టర్‌ను రప్పించి, అతని సమస్యను తెలుసుకున్నారు. రికార్డులు సరిచేసి, తమ భూమి తమకి ఇప్పించాలని ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కలగలేదని, దీంతో ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీ పెట్టుకున్నానని కలెక్టర్ వద్ద గణేష్ వాపోయాడు. అతనికి సంబంధించిన భూముల రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వీలైనంత త్వరలో అతనికి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపించడమే కాకుండా, జరిగిన తప్పిదాలకు సంబంధించి సంబంధిత అధికారులపై క్రమశిక్షణా చర్యలను తీసుకోవాలని సిసిఎల్‌ఎకు నివేదించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. సమావేశంలో ఆర్‌డిఒ డి.కీర్తి, సర్వేశాఖ ఎడి కె.వెంకటరమణ, తాహశీల్దార్ బి.నీలకంఠరావు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్.. అధికారులను ఆదేశించారు. సంబంధిత రైతుతోపాటు, చుట్టుపక్కల రైతులను కూడా పిలవాలని సూచించారు. కొత్తవలస మండలంలో పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన ఎగువ ఎర్రవానిపాలెంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. సంబంధిత భూముల రికార్డులను పరిశీలించారు. సర్వే నంబర్ల ఆధారంగా రైతువారీగా భూ విస్తీర్ణంపై ఆరా తీశారు. గ్రామంలోని భూముల వివరాలను సమగ్రంగా తమకు అందజేయాలని, రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల ప్రకారం రీసర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో సర్వే శాఖ ఎడి కె.రమణమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, తహశీల్దార్ బి.నీలకంఠరావు, ఇతర సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

8 షాపులను కొల్లగొట్టిన ముఠా • పోలీసులకు సవాల్‌గా నిలిచిన చోరీలు

ప్రజాశక్తి-గజపతినగరం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి భవ్య రెడ్డి

గజపతినగరంలో గురువారం అర్ధరాత్రి దొంగలముఠా చెలరేగింది. మెయిన్‌రోడ్డు, మెంటాడ రోడ్డులో ఏకంగా 8 షాపులను కొల్లగొట్టి సెల్‌ఫోన్లు, నగదును దోచుకున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం రెండు బ్యాచ్‌లుగా ఈ చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. పట్టణ ప్రధాన రహదారిలో, నిత్యం జనాలు తిరుగాడే ప్రాంతంలో ఒకేసారి ఇలాంటి చోరీలు జరగడం ఇదే ప్రథమం. ఈ చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం... దొంగలు రెండు బ్యాచ్‌లుగా మెయిన్‌రోడ్డు, మెంటాడ రోడ్డులోని 8 షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. రాత్రి 3 నుంచి 4గంటల మధ్యలో ఈ చోరీలకు పాల్పడినట్లు సిసి కెమెరాల్లో నమోదైన సమయాన్ని బట్టి తెలుస్తోంది. ఒక బ్యాచ్ స్థానిక వెంకీ మొబైల్స్ లో రూ.92వేలు నగదు, 25 మొబైల్స్,6 స్మార్ట్ వాచ్‌లను, తిరుమల ట్రేడర్స్‌లో ఒక ల్యాప్‌టాప్, రూ.5వేల నగదు, డిమార్ట్‌లో రూ.10 వేల రూపాయల నగదు, సూపర్ ఎం-మార్ట్ లో 7 వేల రూపాయల నగదును మొత్తం రూ.1.13లక్షల నగదును దోచుకున్నారు. ఇంకో బ్యాచ్ ఆర్‌కె ఫ్యామిలీ మార్ట్‌లో రూ.30వేలను, హాసిని ఉమెన్స్ కిడ్స్ వేర్ లో పదివేల రూపాయలు నగదు, ఎస్-ఎస్ ఫుట్‌వేర్‌లో వెయ్యిరూపాయలు, శ్రీ వెంకటేశ్వర కిరణా జనరల్ స్టోర్‌లో రూ. 6వేలు నగదు మొత్తంగా రూ.47వేలను దోచుకున్నారు. ఉదయం ఈ విషయాన్ని గమనించి షాపు యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలు జరిగిన షాపులను సిఐ జివివి రమణ, డిఎస్‌పి భవ్య రెడ్డి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను సైతం పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ చోరీలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీసి పోలీసు అధికారులను తక్షణమే ఈ కేసును చేదించి ఇటువంటి సంఘటనలు పునావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం

జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి- మెంటాడ



పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న జెసి సేతు మాధవన్

పామాయిల్ మొక్కలు, బిందుసేద్యం పరికరాలను వంద శాతం రాయితీపై అందిస్తున్నట్లు జెసి సేతు మాధవన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో మహిళా రైతు రామలక్ష్మి పామాయిల్ పంటను ఆయన పరిశీలించారు. పంటదిగుబడి, మార్కెటింగ్, ప్రస్తుత ధర, అంతర పంట కోకో దిగుబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. త్రిభుజాకారంలో నాటితే ఎకరాకు 57 మొక్కలు, చతుర్భుజ ఆకారంలో ఎకరాకు 50 పామాయిల్ మొక్కలు నాటవచ్చన్నారు. ఒక్కో మొక్క ధర రూ.193 ఉంటుందని అన్నారు. పామాయిల్ సాగుకు ముందుకు వచ్చిన రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు వంద శాతం, ఐదెకరాల పైనున్న రైతులకు 50 శాతం రాయితీతో బిందుసేద్యం పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ సాగు కోసం ఎకరాకు రూ.2100, ముదర పామాయిల్ తోటలో అంతర పంటల సాగుకు మరో రూ.2100 ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఉద్యాన అధికారి రాజశేఖరం, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ భానుమూర్తి, ఎఒ గోకులకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో వచ్చే భూసమస్యలు సత్వరం పరిష్కరించాలి

బొండపల్లి : భూముల రీసర్వే సందర్భంగా రైతులకు తలెత్తిన సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు వెనువెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రీసర్వేలో పైలట్ గ్రామంగా గుర్తించిన బొండపల్లి మండలం బి.రాజేరును జాయింట్ కలెక్టర్ శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. రీసర్వే వల్ల కారణంగా వారికి ఎదురయ్యే సమస్యలపై ఆరాతీశారు. భూముల రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ ఏమేరకు పూర్తయిందనే అంశాన్ని పరిశీలించారు. గ్రౌండ్ వాలిడేషన్ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. భూరికార్డుల్లో తప్పొప్పులను సరిచేయడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడాది జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు ఎస్.కోట మండల కేంద్రానికి చెందిన వసంత రామకృష్ణ (26)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కౌగమణి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. రామకృష్ణ 2019లో 9వ తరగతి చదువుతున్న బాలికను వెంటపడుతూ నమ్మించి మోసం చేసి లైంగిక నేరానికి పాల్పడ్డాడని ఎస్.కోట పోలీసు స్టేషనులో ఫిర్యాదు నమోదైంది. అప్పటి ఎస్.కోట సిఐ బి.శ్రీనివాసరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతుల నుంచి టమాటో కొనుగోలు

ప్రజాశక్తి-విజయనగరం

రైతుల పండించిన టమాటో పంటను తగిన మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు ప్రారంభించామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రవి కిరణ్ తెలిపారు. విజయనగరం రూరల్ మండలం కొండకరకాం లో బి. వాసు అనే రైతు నుంచి 500 కిలోల టమాటో పంటను కొనుగోలు చేశామని తెలిపారు. ఒక్కో బాక్స్ 220 రూపాయల వంతున 20 బాక్సులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈపంటను ఎం.ఆర్.హెచ్. రైతు బజార్ లో విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రామభద్రపురం మండలంలో కూరగాయలు పండించే గ్రామాలను ఉద్యాన అధికారులతో కలిసి మార్కెటింగ్ అధికారులు సందర్శించి రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను విక్రయించేందుకు వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించామని తెలిపారు.

గ్రూప్-2 అభ్యర్థుల నిరసన

రోస్టర్ సవరించాకే పరీక్ష నిర్వహించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్




కోట వద్ద నిరసన తెలుపుతున్న గ్రూప్2 అభ్యర్థులు

రోస్టర్ విధానం ప్రకటించకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహిస్తే ఊరుకునేది లేదని గ్రూప్ 2 అభ్యర్థులు నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో నగరంలో కోట జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం గ్రూప్ 2 అభ్యర్థులు చేపట్టారు. రోస్టర్ సవరించకుండా గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం సిద్దమవుతుందటంతో నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ చిరంజీవులు గతంలో గ్రూప్ 2 అభ్యర్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్సీపదవికి రాజీనామా చేయాలని నినదించారు . ప్రభుత్వం రోస్టర్ ను సవరించకుండా పరీక్ష పెడితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమం లో గ్రూప్ 2 అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-డెంకాడ



మృతిచెందిన రాజు

ట్రాక్టర్ ట్యాంకర్‌ను బైక్‌తో వెనుక నుంచి ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన పెదతాడివాడ, పినతాడివాడ గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...

పినతాడివాడ గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు రాజు (17) మెర్సి మిషన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం రాత్రి పెదతాడివాడలో ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. సుమారు రాత్రి 10 గంటల సమయంలో నాతవలస రహదారిలో రెస్టారెంట్ వద్ద రోడ్డుపక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ట్యాంకరును వెనుక నుంచి బలంగా మోటార్ సైకిల్‌తో ఢీకొన్నాడు దీంతో రాజుకు తల, చేయి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సన్యాసినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఆప్కాస్ రద్దుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాయాలని, బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాలని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మిగజపతిరాజును మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కోరారు. ఈమేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్ మోహన్ రావు మాట్లాడుతూ ఆప్కాస్ ను రద్దు చేసి మరల థర్డ్ పార్టీలోకి కార్మికుల్ని తీసుకురాకుండా మున్సిపల్ పారిశుధ్య ,ఇంజినీరింగ్, వాటర్ సప్లయి, స్ట్రీట్ లైట్స్ , లీకులు, వాల్ ఆపరేటర్లు, మొక్కలు, పార్కుల్లో పనిచేసే కార్మికులందరినీ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందించి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రతినిధులు రాఘవ, ఆదినారాయణ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఆప్కాస్ రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిూస్ ఫెడరేషన్ కార్యదర్శి బి.బాబూరావు, కోశాధికారి హరిబాబు డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీకి శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన తుపాకుల రవణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపిఎస్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించడంలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తి పరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని తెలిపారు.

టాయిలెట్లు లేని అంగన్వాడీ భవనాలను మార్చాలి

విజయనగరం : జిల్లాలో టాయిలెట్లు లేకుండా ఉన్న ప్రైవేటు భవనాల్లో ఉంటున్న అంగన్వాడీ కేంద్రాలను ఖాళీ చేసి వారం లోగా కొత్త భవనాల్లోకి మార్చాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఐసిడిఎస్ శాఖ అధికారులతో బరువు తక్కువ ఉన్న పిల్లలు, బరువుకు తగ్గ ఎత్తు లేని వారి వివరాలపై, టీనేజ్ ప్రేగ్నన్సి తదితర అంశాల పై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి టాయిలెట్ లేని వారికి, అదే విధంగా విద్యుత్ సరఫరా లేని భవనాల జాబితాలను అందించాలని, వాటికి వెంటనే విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనీ విద్యుత్, విద్యాశాఖల అధికారులకు ఆదేశించారు.

రాజాపులోవలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని రాజాపులోవలో ఆలయానికి వెళ్లే రహదారి ఆక్రమణలను రెవెన్యూశాఖ అధికారులు శుక్రవారం తొలగించారు. గ్రామానికి చెందిన ఒక కుటుంబం ఈ రహదారిలో రేకుల షెడ్డు, గడ్డి వాము పెట్టడంతోపాటు అదనంగా ఇంటి అరుగు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్తులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి తొలగించాలని కోరినప్పటికీ స్పందించలేదు. దీంతో తహశీల్దార్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ పాపారావు, ఆర్ఐ ఇమ్రాన్, విఆర్ఒలు వెళ్లి ఆక్రమణలను జెసిబితో తొలగించారు.

కాలువలో పూడికలు తొలగించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని కోరాడవీధి, సంఘవీధి సచివాలయాల పరిధిలో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. కోరాడవీధి సచివాలయ పరిధిలో మురుగునీటి కాలువలలో పూడికలు తొలగించాలని, రోడ్లపైన ఎక్కడ చెత్తలు లేకుండా చూడాలని ఆదేశించారు. సంఘవీధి సచివాలయ పరిధిలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్ వద్ద చెత్తను శుభ్రం చేయాలని సూచించారు. కుళాయి నీటిని వృథా చేయరాదని కోరారు.

మొండి బకాయిలపై రెవెన్యూ సిబ్బంది కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాల మొండి బకాయిలపై నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. చాలా కాలంగా పన్నులు చెల్లించని వివిధ సంస్థలు, భవనాల యజమానులు వద్దకు సహాయ కమిషనర్ కె.అప్పలరాజు నేతృత్వంలో రెవెన్యూ బృందం శుక్రవారం పన్ను వసూళ్లకు రంగంలోకి దిగింది. మొండి బకాయిలు ఉన్న సంస్థలు, భవనాల యజమానుల వద్దకు వెళ్లి పన్నులను తక్షణం చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో కొంతమంది హుటాహుటిన పన్నులను చెల్లించారు. మరికొందరు కొద్ది రోజులు గడువును కోరారు. అయితే 24 గంటల్లో బకాయి ఉన్న పన్నులను చెల్లించాలని సహాయ కమిషనర్ బకాయిదారులకు గడువు విధించారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలలో భాగంగా శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం వి.లక్ష్మణరావు, అవార్డు గ్రహీత సైన్స్ ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి తెలిపారు. యువత రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఇఒ పాపునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఇంటర్మీడియట్ ప్రధానమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బి.శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అమ్మలాంటి మాతృభాషను పరిరక్షించుకోవాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.నారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్‌స్కూల్లో అంతర్జాతీయ మాభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పిల్లలతో అమ్మలాంటి మాతృభాష కమ్మనైనది అని పలకలపై రాసి ప్రదర్శన చేశారు. మాతృభాష పరిరక్షణకు కృషి చేసిన గురజాడ, సిపి బ్రౌన్, శ్రీకష్ణదేవరాయలు, యోగివేమన చిత్రపటాలను విద్యార్థులతో ప్రదర్శన చేయించారు ఈ సందర్భంగా విద్యార్థులకు శతక పద్యాల పై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు అనంతరం నారాయణ రావు మాట్లాడుతూ మాతభాషను పరిరక్షించుకోకపోతే అమ్మను మరిచినట్లే అన్నారు. కార్యక్రమం తెలుగు ఉపాధ్యాయులు బి శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు.



వేపాడ.. మాతృభాషా దినోత్సవంలో వివిధ వేషధారణల్లో విద్యార్థినులు

ప్రభుత్వ సంస్కృత కళాశాలలో..

మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో అంతర్జాతీయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జి.జనార్ధననాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం.రమా గీతాదేవి మాట్లాడుతూ మాతృభాష గొప్పదనం, మానవ మనుగడకు హేతువు కాగలదని వివరించారు. తెలుగు భాషా అధ్యాపకులు ఎల్. వరలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అలరించారు. విద్యార్థులకు కథలు, కవితలు, పద్యాలు, పొడుపు కథలు, పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు కవుల వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు.

బొబ్బిలి : మాతృభాషను కాపాడుకోవాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు, రోటరీ కార్యదర్శి సిహెచ్ జె ప్రవీణ్ కుమార్, రఘు కళాశాల ప్రిన్సిపల్ రఘు, వ్యవస్థాపకులు తిరుపతిరావు కోరారు. శ్రీకళాభారతి వద్ద ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు.

రామభద్రపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నాగభూషణరావు ఆధ్వర్యాన విద్యార్థులకు పద్యపఠనం, పొడుపు కథలు, కథలు, కవితలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాలినాయుడు, సింహాచలం, వెంకటి, గంగమ్మలు, ప్రభాకర్ రావు, రత్నకుమారి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రేచర్ల శ్రీలక్ష్మి, వి.సుధీర్, చల్లా శ్రీనివాసరావు, పి.భాస్కర్, లక్ష్మణరావు, రామకృష్ణ, అప్పలరాజు, దివ్య పాల్గొన్నారు.

కవుల పరిచయం

మెంటాడ : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పోరాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు కవులను పరిచయం చేశారు. కవుల చిత్రపటాలు ప్రదర్శించి, వారు రాసిన కవిత్వాలు గురించి తెలుగు ఉపాధ్యాయులు నగేష్ విద్యార్థులకు వివరించారు. అంధులైన తెలుగు ఉపాధ్యాయులు నగేష్... బ్రెయిలీ లిపి ద్వారా విద్యార్థులకు బోధిస్తున్నారు.

వైసిపిలో పదవుల పందేరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పతివాడ అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా అల్లాడ సత్యనారాయణ మూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం పతివాడ అప్పలనాయుడు.. వైసిపి పూసపాటిరేగ మండల అధ్యక్షులుగా పతివాడ ఎంపిటిసి సభ్యులుగా ఉన్నారు. వైస్ ఎంపిపి పదవిలో అల్లాడ సత్యనారాయణమూర్తి ఉన్నారు. జిల్లా స్థాయి పదవులు లభించడంతో వారు సంతోషం వ్యక్తంచేశారు. మండలానికి చెందిన నాయకులను జిల్లా స్థాయి పదవుల్లో నియమించిన జెడ్‌పి చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావుకు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు పూసపాటిరేగ ఎంపిపి మహంతి కళ్యాణి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జెడ్‌పిటిసి భర్త మహంతి జనార్దనరావును బిసి సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమించారని గుర్తుచేశారు. మండలంలో వైసిపి బలోపేతానికి మరింత కృషి చేస్తామన్నారు.

మెరకముడిదాం : వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా సోమలింగాపురం గ్రామానికి చెందిన సిరివురు వెంకటరమణరాజు నియమితులయ్యారు. చీపురుపల్లి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఎంపిపి ప్రతినిధి తాడ్డి వేణుగోపాలరావు (పంచాయతీరాజ్ విభాగం), కెవిఎస్‌ఆర్‌కె ప్రసాద్ (సోషల్ మీడియా విభాగం), పప్పల క్రిష్ణమూర్తి (లీగల్ సెల్ విభాగం), సత్తారు శ్రీనివాసరావు (ఐటి విభాగం) నియమితులయ్యారు. వీరి నియామకంపై వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామభద్రపురం : వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా రామభద్రపురం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు నియమితులయ్యారు. తన మీద నమ్మకంతో పార్టీ ఇచ్చిన పదవికి వన్నె తెచ్చి కార్యకర్తల శ్రేయస్సుకు కృషి చేస్తానని లక్ష్మణరావు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన మాజీమంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

డెంకాడ : డెంకాడ మండలానికి చెందిన ఇద్దరు నాయకులకు వైసిపి జిల్లా స్థాయి పదవులు లభించాయి. పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు.. వైసిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, గుండాలపేటకు చెందిన బుగత రమణ.. జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. దీంతో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ఆర్‌డిఒ సత్యవాణి

ప్రజాశక్తి- చీపురుపల్లి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ జి.సత్యవాణి హెచ్చరించారు. శుక్రవారం పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం అమలుపై ఆర్‌డిఒ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం అమలుపై తీసుకుంటున్న చర్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువని తెలిస్తే గర్భస్రావాలు చేయిస్తున్నారని ఆర్‌డిఒ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి, రికార్డులు సక్రమంగా నిర్వహించని వారిపైనా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఎస్.సూర్యనారాయణ, సిఐ జి.శంకర్ రావు, వైద్యులు ఎం.నాయక్, అర్చన, మానవ హక్కుల సంఘం ప్రతినిది వి.పద్మలత, ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ ఈశ్వరమ్మ, డిఎంహెచ్‌ఒ కార్యాలయ అధికారులు చిన్నతల్లి, ఎం.చాముండేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ డెమో సెక్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజాసంక్షేమం, పేదల అభ్యున్నతే జనసేన లక్ష్యమని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు అన్నారు. కోరుకొండ పాలెం నుంచి కుప్ప రాంబాబు ఆధ్వర్యాన 80 కుటుంబాలు శుక్రవారం వైసిపి నుంచి జనసేనలో చేరాయి. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ విధానాలు నచ్చి జనసేనలో చేరుతున్నారని అన్నారు.

'కూటమి హామీల అమలెప్పుడు?'

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కూటమి ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలైనా ఒక్క హామీని అమలు చేయలేదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి విమర్శించారు. పట్టణంలోని సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపంలో కండిపల్లి భీముడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులపై కొత్త చట్టాలు, జిఒలు చేసి జీవనోపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, జరిమానా పెంచే జిఒ నంబర్ 21, 31 రద్దు చేస్తామని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గిస్తామని సిఎం చంద్రబాబు హామీనిచ్చారని గుర్తుచేశారు. వాహనమిత్ర రూ.15 వేలు ఇస్తామని, డ్రైవర్ల వ్యక్తిగత ప్రమాద బీమా రూ.10 లక్షలు అమలు చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. నేటికీ ఒక్క హామీనీ అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బి.సురేష్, పి.నరసింహస్వామి, పాండు, జి.కృష్ణ, ఆర్.సన్యాసిదేవుడు పాల్గొన్నారు.

ఆర్‌యుబి సమస్యకు పరిష్కారం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం వద్దనున్న ఆర్‌యుబిలో నీటి నిల్వ సమస్య పరిష్కారమైంది. ఈ సమస్యపై ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. ఆర్‌బియులో నీరు నిల్వ ఉండటంతో అందులోనుంచి రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌యుబిలో నీరు చేరకుండా కాంక్రీట్‌తో పనులు చేపట్టారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పాఠశాలకు బోరు వితరణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పతివాడ ప్రాథమిక పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మంచినీటి అవసరాలకు సుమారు రూ.1.30 లక్షలతో బోరు ఏర్పాటు చేస్తోంది. శుక్రవారం పాఠశాలలో బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ఎ.రాజ్ కుమార్, బి.పాపినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల అభ్యున్నతికి సామాజిక స్ఫూర్తితో స్వచ్ఛంద సంస్థలతో పాటు గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని కోరారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వి.హైమావతి, విద్యార్థులు... హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.పైడిరాము, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.గోవిందరావు పాల్గొన్నారు.

మహిళలకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు

ప్రజాశక్తి - సంతకవిటి



మాట్లాడుతున్న డిపిఎం చిరంజీవి

గ్రామ సంఘానికి రెండు చొప్పున పిఎంఇజిపి పథకం కింద లబ్దిదారులను గుర్తించి బ్యాంకు అనుసంధానంతో 35 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని డిపిఎం ఎ.చిరంజీవి తెలిపారు. శుక్రవారం సంతకవిటిలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. హోంకంపోస్ట్ ఫిట్, కిచెన్ గార్డెన్స్‌పై అవగాహన కల్పించారు. మండలంలో ఉన్న 17,129 మంది సభ్యులకు గాను 5,814 మందితో వాటిని తయారు చేయించాలని చెప్పారు. ఫైనాన్స్ ఎపిఎం కె.హేమలత మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించుటకు సీడ్ కేపిటల్ కింద ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున మండలంలో 90 యూనిట్లను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. మండలంలో 230 మందికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల లోపు వుమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్‌లో భాగంగా బ్యాంకుల నుండి వ్యక్తిగత రుణాలు అందించి జీవనోపాధి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. సొంతిల్లు ఉండి నెలకు రూ.850కు మించి విద్యుత్ బిల్లు వచ్చిన వారికి పిఎం సూర్యఘర్ పథకంలో రాయితీపై సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న సభ్యుల వివరాలు సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్, ఎపిఎం దధికుమార్, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు పద్మ, అప్పలనాయుడు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

శారదా పరిశ్రమ ఆధ్వర్యంలో

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంబిస్తున్న శారదా పరిశ్రమ ప్రతినిధులు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీలో శారదా పరిశ్రమ ఆధ్వర్యాన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులకు శారదా పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు క్రీడా దుస్తులు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో శారదా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ దాస్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాత మోహన్, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పరిశ్రమ అడ్వైజర్ మూర్తి, జిఎం అలోక్ చౌదరి, హెచ్‌ఆర్ డిజిఎం సన్యాసిరావు, వాలీబాల్ కోచ్ గవర సూరిబాబు, కె.కృష్ణంరాజు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి, బానాది పాఠశాలలను ఎంఇఒలో నాగభూషణరావు, బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్, రాంబాబు, రమణమూర్తి, ఈశ్వరరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలోని ఇప్పలవలస ఎంపి యుపి పాఠశాలను మండల విద్యాశాఖధికారులు చంద్రశేఖర్, ధర్మ శ్రీను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యాసన స్థాయిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కెజిబివి సందర్శన

గంట్యాడ : మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలలను సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వతరగతి విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. 10వ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాదించాలని వారిని ప్రోత్సహించారు. తదనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై తగు సూచనలు, సలహాలు అందించారు. లాబ్, స్కూల్ రిజిస్టర్స్, స్కూల్ ఆవరణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. స్కూల్ ఆవరణలోగల హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

ముగిసిన అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నై పుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదురోజులు పాటు మహిళాప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారం ముగిసింది. వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఏలా ప్రారంభించాలి, ఎలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి, అనే విశయాలు గురించి అవగాహన కల్పించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్‌తో పాటు ఐఎల్‌ఒ ట్రైనర్స్ వి.అనిల్‌కుమార్, డిఐసి డిడి మధుసూదనరెడ్డి, లీడ్‌బ్యాంకు మేనేజర్ వివి రమణమూర్తి తదితరులు పలు అంశాలను వివరించారు. మహిళా ప్రాంగణం మేనేజర్ పి విమల పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సహకరించండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలో ప్రతిరోజు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం ద్వారా స్థానిక సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. రహదారులపై భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాలను వేయకుండా నియంత్రించాలన్నారు. ఈ నెలాఖరులోగా ప్రకటన పన్నులను శత శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఎక్కడా పోస్టర్లు అతికించకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు. అందరి సహకారంతోనే నగరం క్రమబద్ధీకరణ దిశగా రూపుదిద్దుకుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

అన్నా క్యాంటీన్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సిబ్బందికి కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ ను ఆయన పరిశీలించారు. నిర్ణీత సమయానికల్లా అన్నా క్యాంటీన్ పర్యవేక్షకుడు విధులకు హాజరు కాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. సదరు పర్యవేక్షకుడిని మందలించారు. ఇకనుంచి నిర్ణీత సమయాన్ని కల్లా ముందుగా అన్నా క్యాంటీన్ వద్దకు చేరుకోవాలని, అన్ని పనులు సక్రమంగా సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు.

ముందు జాగ్రత్తలతో క్షయ నివారణ

ప్రజాశక్తి-రామభద్రపురం

ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే క్షయ వ్యాధి నివారణ సాధ్యమని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ వైద్యురాలు ప్రియదర్శిని తెలిపారు. మండల పరిధిలోని ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించిన దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ అనేది అంటువ్యాధి కాదని, ఈ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి రత్నదీపక్, టీబీ పర్యవేక్షకురాలు శ్రీదేవి, వైద్య సిబ్బంది పొట్టా కిషోర్, ఎఎన్‌ఎం శ్రీదేవి, ఆశాలు శ్రవంతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.